క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

దుర్గి: మండలంలోని పలు గ్రామాల్లో గత కొన్ని నెలలుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం నుంచి మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ప్రజా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

యువకుడు కనిపించడం లేదని ఫిర్యాదు

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం గ్రామానికి చెందిన గంటా త్రినాథ్ గత నెల (జనవరి) 27న పిడుగురాళ్ల వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. బంధువు, మిత్రుల వద్దకు వెళ్లి వెతికినా ఆచూకీ తెలియలేదు. ఎంతకూ ఆచూకీ తెలియక పోవడంతో తండ్రి గంటా మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రహదారి ఆక్రమణ తొలగించాలి



సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డు వావిలాల్ నగర్ కాలనీలో రహదారి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు స్పందించారు. కాలనీకి చెందిన గరికపాటి రమణయ్య, తాళ్లూరి శ్యాం ప్రసాద్‌ల ఫిర్యాదు మేరకు మంగళవారం తహసీల్దార్ కె.నగేష్, రెవెన్యూ అధికారులు పరిశీలన చేశారు. రహదారి ఆక్రమణ తక్షణమే తొలగించాలని హెచ్చరించారు. వెంటనే తొలగించకపోతే తాము జోక్యం చేసుకొని తొలగించాల్సి ఉంటుందన్నారు.ఆయనతో పాటు ఆర్ఐ ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

ముగిసిన జగన్నాథస్వామి వార్షిక బ్రహోత్సవాలు



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీసుభద్రా, బలభద్రా సహిత శ్రీజగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా స్వామి వారికి విష్వక్సేనపూజ, నవగ్రహపూజ, లక్ష్మీసంవాదం, పర్యంకసేవ, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రీ సర్వేను పరిశీలించిన తహసీల్దార్



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని ఉప్పువాగు వద్ద సుమారు 30 ఎస్సీ కుటుంబాల వారు 50 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్నారు. ఎటువంటి ఆధారాలు లేవని, సాగు హక్కు పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఆ మేర వారి వివరాలు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. ఎవరెవరు ఎంత మేర భూమిని సాగు చేసుకుంటున్నారో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. మండల సర్వేయర్ ఏడుకొండలు, ఆర్ఐ కపిల్, వీఆర్వో హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆక్రమించిన ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

బెల్లంకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో టీడీపీ నేత. అతని అనుచరులు ఆక్రమించిన ప్రభుత్వ భూమిని కాపాడాలని మండల వైస్సార్ సీపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ బి.నిర్మలకు వినతిపత్రం అందజేశారు. బెల్లంకొండ గ్రామంలో సర్వే నంబర్ 524లో స్త్రీ శక్తి భవనం, డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమిని, టీడీపీ నాయకుడు అతని అనుచరులు కబ్జా చేసి, అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. తాజాగా జరుగుతున్న నిర్మాణాలను తక్షణం నిలిపివేసి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మండల కో ఆప్షన్‌మెంబర్ కావూరి షేక్ దరియా, మండల మైనార్టీ సెల్ నాయకుడు బడాబావ, పాకాలపాటి మాలాలి, గద్దిపర్తి బాబూరావు, దూదా మస్తే, జానీ తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలి

డీఈఓ వెంకటప్పయ్య



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటప్పయ్య

రెంటచింతల: తరగతి గదిలోని ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ చూపాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటప్పయ్య అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన మాచర్ల, గురజాల నియోజక వర్గాలలో ఉన్న 9 మండలాలలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు, 10వ తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు పరీక్షా ఫలితాలపై సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2022-2023 విద్యాసంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎస్ఏ-1 పరీక్షా ఫలితాలపై సమీక్షించారు. ఈ పరీక్షా ఫలితాల్లో 50 శాతం కన్నా తక్కువ వచ్చిన పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసి రానున్న పరీక్షల్లో విద్యార్థులకు అదనపు తరగతులను నిర్వహించి ఖచ్చితంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. తరగతిలోని వెనుకబడిన ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టిపెట్టి ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా చదివించాలన్నారు. నిర్వహించనున్న పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిన పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలపై, ఆయా తరగతులకు వెళ్ళే ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో డాప్యూటీ డీఈఓ సత్తెనపల్లి వి.వెంకటేశ్వరరావు, 9 మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వం ఆదుకుంది

- తలసేమియా బాధితురాలు పాడి కావ్య
- రూ. 10 వేల పింఛన్‌ను కావ్యకు మంజూరు చేసిన ప్రభుత్వం



పాడి కావ్యకు పెంఛన్ నగదు అందజేస్తున్న సర్పంచ్ కాశయ్య, పంచాయతీ కార్యదర్శి

దాచేపల్లి : పుట్టిన మూడేళ్ల నుంచే తలసేమియాతో బాధపడుతుంది. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం చేసే తల్లిదండ్రులు కుమార్తె ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉన్న పొలాన్ని అమ్మి వైద్యం చేయించారు. గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ లలోని హాస్పిటల్స్‌లో లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించారు. జీవితకాలం వైద్యం అందించాలని వైద్యులు చెప్పారు. 20 రోజులకు ఒక్కసారి రక్తం ఎక్కించాలని డాక్టర్లు సూచించారు. ఆర్థికంగా చితికి పోయిన వీరికి ప్రభుత్వం అండగా నిలిచింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడకు చెందిన పాడి శ్రీనివాసరావు, పద్మ దంపతుల రెండవ కుమార్తె కావ్య తలసేమియా వ్యాధితో బాధపడుతుండడంతో ప్రభుత్వం రూ.10 వేల పింఛన్‌ను మంజూరు చేసింది. మొట్టమొదటి పింఛన్ నగదును ఫిబ్రవరి నెలలో కావ్య అందుకుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని ఉచితమే...

పాడి శ్రీనివాసరావు, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న రెండవ కుమార్తె అయిన కావ్యకు వైద్యం చేయించేందుకు తల్లిదండ్రులు తీవ్రంగా శ్రమించారు. తలసేమియా వ్యాధితో బాధపడేవారికి ప్రభుత్వం రూ.10 వేల పింఛన్‌ను ఇస్తోందని తెలుసుకున్న కావ్య తండ్రి శ్రీనివాసరావు జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కలిసి పింఛన్‌పై మాట్లాడారు. తలసేమియాకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించి ధృవీకరణ పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. వలంటీర్, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం విచారణ చేసి కావ్య తలసేమియా వ్యాధితో బాధపడుతున్నట్లుగా ధృవీకరణ చేసి పింఛన్ మంజూరు కోసం ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపారు. దీంతో ప్రభుత్వం రూ.10 వేల పింఛన్‌ను కావ్యకు మంజూరు చేసింది. గతంలో వైద్యం కోసం ఇరుగుపొరుగు వారి నుంచి అప్పులు తీసుకుని వెళ్లే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయడంతో ఆ డబ్బులతో వైద్యం చేయించుకుని వస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

డిప్యూటీ ఈఈ రామయ్య



డిప్యూటీ ఈఈ రామయ్య

దుర్గి: వినియోగదారులకు, రైతులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయడమే తమ లక్ష్యంగా మాచర్ల డిప్యూటీ ఈఈ ఎ రామయ్య అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహిస్తున్న మరమ్మతులను ఉన్నత అధికారులు సందర్శించారు. గుంటూరు ఎస్ఈ ఎ మురళీకృష్ణ యాదవ్ మాచర్ల ఈఈ జె హరిబాబు, డిప్యూటీ ఈఈ ఎ రామయ్య విద్యుత్ ఉప కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ ఈఈ ఎ రామయ్య ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్యుత్ కోసం పాత పోల్స్ తొలగించి అధునాతనమైన పరికరాలను ఏర్పాటు చేసి నిరంతరంగా విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించి వినియోగదారులకు, రైతులకు, వ్యాపారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని వారికి సూచించారు. స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9గం''ల నుంచి సాయంత్రం 4గం''ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజలందరూ సహకరించి మెరుగైన విద్యుత్ సరఫరాకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల ఏఈ ఎం రాంబాబు విద్యుత్ కాంట్రాక్టర్ బాలయ్య లైన్‌మెన్ జి. గోపాల్ సిబ్బంది తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కరించాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం అధ్యక్షతన నిర్వహించిన మండల సమీక్షా సమావేశంలో ఎంపీపీ చౌడేశ్వరి మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక అధికారుల సహకారంతో రానున్న వేసవిలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రెంటచింతల నుంచి గురజాల, కారెంపూడి మీదుగా పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేటకు ఒక ఆర్టీసీ బస్సును, జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌కు అదనంగా మరో ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. 2023-2024 సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఉపాధి(పని) చూపించేందుకు అవసరమైన పనులను గుర్తించాలని సూచించారు. నివాస పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారించడం ద్వారా విషజ్వరాలైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరిచేరవనే విషయంపై గ్రామస్తుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులు, చిన్నారులకు ఖచ్చితంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, ఈఓపీఆర్డీ రామచంద్రరావు, పీఆర్ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, కార్యదర్శులు జి.అనంత కోటేశ్వరరావు, వెంకయ్య, రమేష్ పాల్గొన్నారు.

సృజన్మాతకతను వెలికితీసేందుకు సైన్స్‌ఎక్స్‌పో



విద్యార్థుల ఎడ్యు టాలెంట్ ఎక్స్‌పోను తిలకిస్తున్న ఎంఈఓ యేసురత్నం

క్రోసూరు: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు ఎడ్యుటాలెంట్ ఎక్స్‌పో ఎంతగానో దోహదపడుతుందని క్రోసూరు ఎంఈఓ యేసురత్నం అన్నారు. మంగళవారం క్రోసూరులోని దిసెంటాన్స్ ఇంగ్లీషుమీడియం పాఠశాల ఆవరణలో అన్ని తరగతుల విద్యార్థులతో ప్రయోగాత్మక ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ పాల్గొని ప్రదర్శనను తిలకించి సంతృప్తి చెందారు. విద్యార్థుల్లో చిన్న తరగతుల నుంచి ఇటువంటి ఎడ్యు టాలెంట్ ఎక్స్‌పో ఏర్పాటు చేస్తుండడంతో పాఠ్యాంశాలు బాగా అర్థం చేసుకోగలగుతారన్నారు. అదేవిధంగా ప్రతి సబ్‌జెక్ట్‌పై బాగా అవగాహన ఉంటుందన్నారు. నేటి విద్యా రంగంలో పోటీ తత్వంతోనే విద్యార్థులు భవిష్యత్తు తీర్చుదిద్దుదోగలగుతున్నారని అన్నారు. పాఠశాలలన్నీ ప్రతి ఏటా ఇటువంటి ప్రయోగాత్మక ప్రదర్శనలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులు సులభంగా పాఠాలు నేర్చుకోవాలంటే ప్రయోగాత్మక పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపల్ మేరీ రజిత మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ఆవిష్కరణలను ఇటువంటి ప్రదర్శనల ద్వారా వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన మంచినీటి ట్యాంకు నిర్మాణం

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని ఫిల్టర్ హౌస్ ప్రాంత పరిధిలో ప్రజల సౌకర్యార్థం రూ.4లక్షల 50వేల రూపాయల పంచాయతీ రాజ్ నిధులతో నూతన మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులకు ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇచ్చిన హామీ మేరకు ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు నాటికి ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించనున్నారు. ప్రస్తుతం ఉన్నత పాత ట్యాంకును కూల్చివేసి కాంక్రీట్ ట్యాంకు పనులు జరుగుతుండడంతో కాలనీవాసులు ప్రభుత్వ విప్ పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

గురజాల : హెచ్ఐవి/ ఎయిడ్స్‌పై అవగాహన అవసరమని సూపర్‌వైజర్ ఇహెచ్ఓ రామ్ అన్నారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఎపిసాక్స్, చైల్డ్ ఫండ్ ఇండియా వారి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి లింక్ వర్కర్ స్కీమ్ బాగా పనిచేస్తోందన్నారు. హెచ్ఐవి ఎలా వ్యాప్తి చెందుతుంది. దాని నివారణ ఏ విదంగా చర్యలు చేపట్టాలి అన్న విషయాలను అవగాహన కల్పించారు. హెచ్ఐవి స్టేజిని గుర్తించి తక్షణమే వారికి మందులు ఇప్పించడం వల్ల వారు జీవితకాలం ఆనందంగా జీవించవచ్చన్నారు.హెచ్ఐవి/ ఎయిడ్స్ సోకిన వారి పట్ల వివక్షత చూపరాదన్నారు. కార్యక్రమంలో జోన్2 సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, లింక్ వర్కర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమావేశం

కారెంపూడి: స్థానిక పీహెచ్‌సీలో చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో లింక్ వర్కర్స్, ఆశ వర్కర్స్ ప్రత్యేక సమావేశం మంగళవారం జరిగింది. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామాంజనేయులు కోరారు. వ్యాధి బారిన పడిన వారికి ఏఆర్‌టీ ట్రీట్‌మెంట్ ఇప్పిస్తూ వారు ఎక్కువ కాలం జీవించేలా వర్కర్స్ కృషిచేయాలని ఆ సంస్థ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు సూచించారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ప్రచారం చేయాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

మాచవరం: మహిళపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని నాగేశ్వరపురం తండాలో గత నెల 30న ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన కుమారిభాయిపై అదే గ్రామానికి చెందిన సంధ్యాభాయితో పాటు దాడి చేసి బూతులు తిడుతూ, కొట్టారు. గురజాల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హుండీ కానుకల ఆదాయం రూ.5.28లక్షలు

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి తిరునాళ్ల మహోత్సవాల్లో అమ్మవారి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.5,28,871లు వచ్చినట్లు దేవాదాయ కార్యనిర్వహణాధికారి జి.రామకోటిరెడ్డి తెలిపారు.

సామాజిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

బెల్లంకొండ: విద్యార్థులు బాల్య దశ నుంచే సామాజిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుకోవాలని క్యాపిటల్ ఏరియా కౌన్సిల్ ఆఫ్ సొసైటీ అధ్యక్షుడు సాతులూరి రామాంజనేయులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాపిటల్ ఏరియా కౌన్సిల్ ఆఫ్ సొసైటీ సంస్థ మరియు యాంటీ హ్యూమన్ ట్రాపింగ్ యూనిట్ పల్నాడు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమాజంలో జరుగుతున్న ఘటనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసే వారి గురించి వివరించారు. చదువు లేకుండా పేదరికంలో ఉన్న వారిని లోన్లు ఇప్పిస్తామని, చదువు చెప్పిస్తామని మహిళలు, బాలికలను మోసం చేసేవారి గురించి వివరించారు. గుడ్ టచ్- బ్యాడ్ టచ్, మిస్సింగ్ కేసులు, మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పల్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్ అల్లూరి రెడ్డి, న్యూ విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఏడుకొండలు, దిశ ఫౌండేషన్ చైర్మన్ అనురాధ, ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ చంద్రశేఖర్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ చంద్రశేఖర్

దాచేపల్లి : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జీ. చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంపై ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన సమావేశం మంగళవారం జరిగింది. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటే ముందస్తుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు ఇంటి వద్దకే వెళ్లి గర్భిణులు వైద్య పరీక్షలు చేసి కాన్పులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, 104 వాహనంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. శస్త్ర చికిత్స కాకుండా గర్భిణులు సుఖప్రసవం అయ్యేలా చూడాలని, కాన్పు కారణంగా ఏ తల్లి బిడ్డ చనిపోకూడదన్నారు. సమావేశంలో డాక్టర్ ఆమూల్య, యూడీసి అచంట శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ రవికుమార్, గొవిందమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంది

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి సైదారావు

దాచేపల్లి : నాయీబ్రాహ్మణులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉందని ఆ పార్టీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి దాచేపల్లి సైదారావు మంగళవారం దాచేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. దేవదాయశాఖ పరిధిలోని అన్ని ఆలయాల ట్రస్ట్ బోర్డు సభ్యుల నియమకాల్లో నాయీబ్రాహ్మణులకు సామాజిక వర్గం నుంచి ఒకరికి స్థానం కల్పించాలని ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం శుభపరిణామమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అడుగడుగునా నాయీబ్రాహ్మణులు అన్యాయానికి గురైయ్యారని, ఎన్నో విధాలుగా అవమానించారని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పక్షనేతగా ఉన్న సమయంలో నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఆలయ ట్రస్ట్ బోర్డులో అవకాశం కల్పించారని ఆయన గుర్తు చేశారు. నాయీబ్రాహ్మణుల కలను సాకారం చేస్తు గవర్న విశ్వభూషణ్ హరిచందన్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావడం చరిత్రాత్మకమని సైదారావు చెప్పారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కంభంపాటి వెంకట్రావ్, దాచేపల్లి నాగేశ్వరరావు, అన్నవరపు శ్రీనివాసరావు, దాచేపల్లి వెంకటనర్సయ్య, పల్లెగుంత వెంకటేశ్వర్లు, అన్నవరపు సతీష్ తదితరులున్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న పుణ్యదంపతులు

వెల్దుర్తి: మండలంలోని బోదిలవీడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అలివేలు మంగ పద్మావతి వెంకటేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. మంగళవారం స్వామి వారి కల్యాణాన్ని ఉదయం 11గం''ల సమయంలో గ్రామానికి చెందిన 11 మంది పుణ్యదంపతులు పీటల పై కూర్చొని స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. 23వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు సమష్టిగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం చూపరులను ఆకట్టుకుంది. స్వామి వారి దేవాలయానికి రంగు రంగుల విద్యుత్ కాంతులను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వారు వివిధ గ్రామాల్లో నివాసముంటున్న వారు స్వామి వారి కల్యాణోత్సవానికి గ్రామానికి చేరుకుని బంధు మిత్రులతో ఆనందంగా కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ



ఉపాధి హామీ పనులపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ కోటేశ్వరావు

విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని నాగులవరం పంచాయతీ పరిధిలో ఉన్న సుబ్బారెడ్డి పాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధీ హామీ పనులను మాచర్ల ఎంపీడీఓ కోటేశ్వరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఊర చెరువు కట్ట చుట్టూ జరుగుతున్న ఉపాధీ హామీ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోగిరెడ్డి వెంకటరావమ్మ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఓ నాగశ్రీనివాసరావు, జూనియర్ ఇంజినీర్ వెంకటేశ్వరావు, ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ బద్దెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆలయ పాలకవర్గాల్లో ఓ ధర్మకర్తగా నాయీబ్రాహ్మణలను నియమించేలా ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 610 ఆలయాలకు పాలకవర్గాలను నిమించాల్సిన ఉండగా, వీటన్నింటిలో నాయీబ్రాహ్మణ నుంచి ఒకరు చొప్పున సభ్యుడిగా చేర్చాలని పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు చెందిన 97 ఆలయాల్లో 1,121 మంది నాయీబ్రాహ్మణ క్షరకులుగా ఉన్నారని, 1,169 ఆలయాల్లో భజంత్రీలుగా పనిచేస్తున్నారని, 100 మంది చెవులు కుట్టే వారు, 500 మంది పల్లకి మోసే విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేవాలయాల సాంప్రయాలతో వీరికి అనుబంధం ఉండడంతో, నిర్వాహణల్లో వీరిని భాగస్వామ్యం కల్పించేలా ప్రతి ట్రస్ట్ బోర్డులో ఒకరిని సభ్యుడిగా అవకాశం ఇస్తున్నట్లు ఈ నెల 3వ తేదీన జీఓ జారీ చేయడం ఆనందంగా ఉందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మార్కెట్ యార్డు డైరెక్టర్ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు నెమలికంటి సైదులు, మనుగోటి వీరబ్రహ్మం, ముక్కరాల వెంకట్రావు, ముక్కరాల రామారావు, ముక్కరాల ఏడుకొండలు, ముక్కరాల నారాయణస్వామి, పొన్నూరి నాగేశ్వరరావు, తుళ్లూరి రమేష్ తదితరులు ఉన్నారు.

సైబర్ క్రైమ్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

పిడుగురాళ్ల: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో సైబర్‌నేరాలు, క్రైమ్‌నేరాలపై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే సీఐ నాగార్జునరావు మాట్లాడుతూ... లోన్ యాప్ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లోను యాపుల వారు ఒక రోజు రెండు రోజుల్లోను లోపలనే లోన్ ఇస్తామంటూ మీ అకౌంట్లోకి డబ్బు జమ చేసి రెండు మూడు నెలల తర్వాత వారి దగ్గర నుంచి అధిక మొత్తంగా వసూలు చేయడం జరుగుతుందన్నారు. మీరు లోను కట్టని ఎడల వారు మిమ్మల్ని బెదిరించడం జరుగుతుందని, అలా లోన్ యాప్ సైబర్ నేరగాలకు లోబడకుండా వారికి మీ అకౌంట్ నంబర్లను ఆధార్‌కార్డులను ఓటీపీలను చెప్పవద్దని తెలియజేశారు. అలాగే లోను యాప్ నుంచి బాధించపడుతున్న వారు ఎవరైనా ఉంటే 1930 కల నంబర్‌కి కాల్ చేసి చెప్పవలిసిందిగా కోరారు. ప్రజలు, ప్రయాణికులు, ఆటో డ్రైవర్స్, ఆర్‌పీఎఫ్, రైల్వే పోలీసులు తదితరులు ఉన్నారు.